క్లుప్తంగా

హరీశ్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నేతలు


హరీశ్‌రావును కలిసిన అశోక్‌గౌడ్, పార్టీ నాయకులు

నర్సాపూర్: ఎమ్మెల్యే హరీశ్‌రావును నర్సాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లో పార్టీ అభివృద్ధికి హరీశ్‌రావు పలు సూచనలు చేశారని ఆయన తెలిపారు.

సజావుగా సన్నబియ్యం పంపిణీ


రేషన్‌డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ మన్నన్

చిన్నశంకరంపేట(మెదక్): సన్న బియ్యం పంపిణీలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా నిర్వహించాలని తహసీల్దార్ మన్నన్ కోరారు. శుక్రవారం తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ దుకాణాదారులు సమయపాలన పాటించడంతో పాటు సకాలంలో ప్రజలకు బియ్యం అందించాలని సూచించారు. రేషన్ వినియోగదారులతో మర్యాదగా వ్యవహరించాలని చెప్పారు. సన్న బియ్యం పంపిణీ విషయంలో ప్రభుత్వ ప్రతిష్ట పెంచేలా డీలర్ల పనితీరు ఉండాలని కోరారు. సమావేశంలో ఉప తహసీల్దార్ ప్రభుదాస్, ఆర్ఐ రాజు ఉన్నారు.

ఎక్సైజ్ సీఐ బాధ్యతల స్వీకరణ


గులాం ముస్తఫా

నర్సాపూర్: నర్సాపూర్ ఎక్సైజ్ సీఐగా గులాం ముస్తఫా బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి సీఐ గోపాల్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి తది త ర నిషేధిత మత్తు పదార్థాలు అమ్మినా, కల్గి ఉ న్నా చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని సీఐ ముస్తఫా హెచ్చరించారు. నాటు సారా త యారు చేసినా, కల్తీకల్లు అమ్మినా చట్టప్రకా రం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గిరిజన గురుకులంలో కౌన్సెలింగ్


సీట్లు పొందిన విద్యార్థినిలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని గిరిజన బాలికల గురుకులంలో విద్యార్థినులకు ఇంటర్మీడియెట్‌కు సంబంధించిన కౌన్సెలింగ్ శుక్రవారం నిర్వహించారు. మెదక్, నిజామాబాద్, కామారెడ్డి, జిల్లాలలో మెదక్, నర్సాపూర్, చేగుంట, ఎల్లారెడ్డి, హన్మాజీపేట, ఇందల్వాయిలోని గురుకుల కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ కోర్సులకు విద్యార్థినిలు ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా రీజినల్ కో ఆర్డినేటర్ గంగారాం నాయక్ మాట్లాడుతూ అన్ని గురుకుల కళాశాలల్లో మెరిట్ ఆధారంగా సీట్లు భర్తీ చేసినట్లు తెలిపారు. కేవలం హన్మాజీపేట గురుకులంలో ఎంపీసీలో సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. ఈ కౌన్సెలింగ్‌లో ప్రిన్సిపాల్ సుమతి, శ్యామలాదేవి, లలితదేవి, పద్మజ, వాణి, సావిత్రి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పేదలకు వరం

మనోహరాబాద్(తూప్రాన్): కల్యాణలక్ష్మి పథకంతో పేదలకు ఎంతో మేలు కలుగుతుందని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. 31 కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ర్యాకల కృష్ణగౌడ్, శోభన్, పాండు, వెంకటేష్, కళ్యాణ్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నేడు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి పంచమ వార్షికోత్సవం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేటలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి పంచమ వార్షికోత్సవ వేడుకలు శనివారం జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ఉదయం పంచామృత అభిషేకం, హోమం స్వామి వారి కల్యాణోత్సవం వేడుకలను జరపనున్నారు. ఈ కార్యక్రమానికి రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతీ స్వామి హాజరుకానున్నారు.

లింకు రోడ్ల పనుల ప్రారంభమెప్పుడు..?

టెండర్ పూర్తయినా పనులు జరగని వైనం


గౌతాపూర్ నుండి సోమక్కపేట్ వరకు వేయాల్సిన లింక్ రోడ్డు

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల, తండాల మధ్య సమన్వయం పెరగాలని, ప్రజలకు గమ్యం చేరువ కావాలని, ప్రయాణ భారం పడకూడదనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాలను, తండాలను కలిపే విధంగా లింక్ (బీటీ) రోడ్డులను నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. చిలప్‌చెడ్ మండలంలో ఎనిమిది చోట్ల లింక్ రోడ్డు నిర్మాణాలకు ప్రతిపాదనలు వచ్చాయి. ఆ నిర్మాణాలకు నిధులు సైతం మంజూరయ్యాయి. రహీంగూడ నుంచి ఎల్లు గుట్టను కలుపుతూ ఫైజాబాద్ వరకు సుమారు 3.10 కిలోమీటర్ల రోడ్డు పనులకు రూ.2.96 కోట్లు, గౌతాపూర్ నుంచి మల్లక్క చెరువు తండాను కలుపుతూ రాందాస్‌గూడ వరకు సుమారు 2.5 కిలోమీటర్ల రోడ్డు పనులకు రూ. 2.21 కోట్లు, శీలాంపల్లి జెడ్పీ రోడ్డు నుంచి జైరాంతండా, అంతారం కలుపుతూ చెరువుకొమ్ము తండా వరకు, సుమారు 1.2 కిలోమీటర్ల రోడ్డు పనులకు, రూ.1.05 కోట్లు, శీలాంపల్లి జెడ్పీ రోడ్డు నుంచి అంతారం, నామ్యాతండాను కలుపుతూ మొండి తండా వరకు, సుమారు 2.7 కిలోమీటర్ల రోడ్డు పనులకు, రూ. 2.24 కోట్లు, శీలాంపల్లి జెడ్పీ రోడ్డు నుంచి చంద్రు తండాను కలుపుతూ సోమ్లా తండా వరకు కిలోమీటరు రోడ్డు పనులకు, రూ. 81 లక్షలు, జగ్గంపేట నుంచి దయ్యాల తండా వరకు 1.1కిలోమీటరు రోడ్డు పనులకు, రూ.1.05 కోట్లు, గౌతాపూర్ నుంచి రాందాస్‌గూడను కలుపుతూ సోమక్కపేట్ వరకు 2.5 కిలో మీటర్ల రోడ్డు పనులకు, రూ. 2.05 కోట్లు, గౌతాపూర్ నుంచి బుజిరంపేట్ వరకు 3.5 కిలోమీటర్ల రోడ్డు పనులకు, రూ. 2.95 కోట్లు మంజూరయ్యాయి. చిలప్‌చెడ్ మండలంలో మొత్తంగా 17.60 కిలో మీటర్ల లింక్ రోడ్ల పనులకు రూ. 14.74 కోట్లు మంజూరు అయ్యాయి. గౌతాపూర్, సోమక్కపేట్ రోడ్డు పనులకు టెండర్ పూర్తయినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. రోడ్డు పనులను త్వరగా ప్రారంభించేందుకు గ్రామ నాయకులు ఎమ్మెల్యే సునీతారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

త్వరలోనే ప్రారంభిస్తా

గౌతాపూర్ నుంచి రాందాస్‌గూడ గ్రామాన్ని కలుపుతూ సోమక్కపేట వరకు చేసే రోడ్డు పనులకు టెండర్ వేశానని, ప్రస్తుతం రోడ్డు పనుల ప్రారంభానికి అన్ని ప్రభుత్వ అనుమతులు వచ్చాయిజ త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభిస్తాం. పలు కారణాలతో రోడ్డు పనులు ఆలస్యం అయ్యాయన్నారు.

– మల్లేశం, కాంట్రాక్టర్

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి


శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థుల వివరాలు తెలుసుకుంటున్న ఎంఈఓ


కాడిపల్లి(నర్సాపూర్): అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఎంఈఓ బుచ్చనాయక్

శివ్వంపేట(నర్సాపూర్): తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ బుచ్చనాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధి పిల్లుట్ల గ్రామంలో బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులను ఎంఈఓ బుచ్చనాయక్ అవగాహన కల్పించారు. చదువు మధ్యలో మానేసిన విద్యార్థులను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పుస్తకాలు ఉచితంగా ఇవ్వడంతో పాటు ఉత్తమ బోధన అందివ్వనున్నట్లు తెలిపారు.

కౌడిపల్లి(నర్సాపూర్)..

కౌడిపల్లి(నర్సాపూర్): పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. శుక్రవారం ఇంటింటికి తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాతోపాటు ఉచితంగా పుస్తకాలు, పౌష్టికాహారం తదితర అన్నిరకాల సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దశరథ్, నాగజ్యోతి, కవిత, శ్రీకాంత్, మురళి, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ జగన్ పాల్గొన్నారు.


చేగుంట(తూప్రాన్): బడిబాట అవగాహన నిర్వహిస్తున్న ఎంఈఓ నీరజ

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

చేగుంట(తూప్రాన్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చదివించాలని ఎంఈఓ నీరజ అన్నారు. మండల కేంద్రమైన చేగుంటలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం అందించి నాణ్యమైన విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు. తల్లిందండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్ పాల్గొన్నారు.

లారీలు వెంటనే అన్‌లోడ్ చేయాలి

నర్సాపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వడ్లు తెచ్చే లారీలను వెంటనే అన్‌లోడ్ చేయించాలని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండలంలోని పలు రైసు మిల్లులను పరిశీలించి, యజమానులకు పలు సూచనలు చేశారు. రైసుమిల్లుల్లో ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని, వడ్ల లారీలు రాగానే వీలైనంత త్వరగా బస్తాలు అన్‌లోడ్ చేయించి లారీలు తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపాలని ఆయన సూచించారు. వర్షాలకు వడ్లు తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తడిసిన వడ్లను సైతం కొనుగోలు చేస్తారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ చెప్పారు.

నేడు కొత్తపేటలో న్యాయసదస్సు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని కొత్తపేటలో శనివారం న్యాయసదస్సు నిర్వహిస్తున్నట్లు న్యాయవాది శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సదస్సుకు నర్సాపూర్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి హేమలత హాజరవుతున్నట్లు చెప్పారు.

ముగిసిన ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి దొంతి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించిన ఉత్సవాలు అఖరి రోజు స్వామివారికి ఆలయ అర్చకుడు గోపాలకృష్ణ ప్రత్యేక పూజలు అనంతరం చక్రస్నానం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం చేసిన గ్రామస్తులకు, భక్తులకు ఆలయ ధర్మకర్తలు అమరేందర్‌రెడ్డి, సంజయ్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఉరేసుకొని ఆత్మహత్య

రామాయంపేట(మెదక్): పట్టణంలో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణానికి చెందిన గడ్డం గంగాగరం (55) జాతీయ రహదారి పక్కనే చెట్టుకు ఉరేసుకున్నాడు. విగతజీవిగా ఉన్నట్లు చూసిన కొందరు పోలీసులు దృష్టికి తీసుకెళ్లారు. కుటుంబ సమస్యలతోనే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఎస్సై బాలరాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజీపేటలో శుక్రవారం ఏఈఓ కల్యాణి ఆధ్వర్యంలో ఫార్మర్ రిజిస్ట్రీ సైట్‌లో రైతుల వివరాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే రైతు సంక్షేమ పథకాల అర్హత కోసం ఫార్మర్ రిజిస్ట్రీ అవసరమని తెలిపారు. దీనికోసం రైతుల వివరాలను నమోదు చేస్తున్నట్లు ఏఈఓ తెలిపారు. ప్రతి రైతు అవకాశం వినియోగించుకోవాలని కోరారు.

నాలుగు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న ఐకేపీ డీపీఎంలు

హత్నూర (సంగారెడ్డి): నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని ఐకేపీ డీపీఎంలు జయశ్రీ, కొమురయ్యలు స్పష్టం చేశారు. హత్నూర మండలం గుండ్లమాచునూర్,చందాపూర్,దౌల్తాబాద్, గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం వారు పరిశీలించారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు తెచ్చిన ధాన్యంతో పాటు పొలాల వద్ద ఉన్న ధాన్యాన్ని సైతం వెంటనే తూకం వేసి కొనుగోళ్లు పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఎప్పటికీ మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్ల పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లను వేగవంతం చేసి రైస్ మిల్లులకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం దేవేందర్ ఉన్నారు.

రూప్లతండాలో చికున్‌గున్యా లక్షణాలు


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న నాగమణి

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండలం వంగ్దల్ రూప్లతండాలో చికున్‌గున్యా లక్షణాలతో గిరిజనులు బాధపడుతున్నారు. రెండు నెలలుగా జ్వరం, నొప్పులతో ఇబ్బందులుపడుతున్నామని తండావాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కంగ్టీ పీహెచ్‌సీ వైద్య అధికారి నాగమణి ఆధ్వర్యంలో శుక్రవారం రూప్లతండాలో వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటింటా తిరిగి బాధితుల వివరాలు సేకరించారు. 9 మంది జ్వరం, నొప్పులతో బాధపడుతున్నారని గుర్తించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌతమ్, ఏఎన్ఎం సుజాత పాల్గొన్నారు.

గణితంలో లావణ్యకు పీహెచ్‌డీ

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని లావణ్య డాక్టరేట్‌కు అర్హత సాధించారు. లై బీజ గణిత పద్ధతి ఉపయోగించి వివిధ సమరూప బిందువు సమూహాలకు చెందిన అణువుల యొక్క అధిక నాణ్యత కంపన పౌనఃపున్యాలు అనే అంశంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అధ్యాపకుడు డాక్టర్ విజయ శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

వైభవంగా పెద్దమ్మ కల్యాణం


అమ్మవారికి ఒడి బియ్యం సమర్పిస్తున్న భక్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దమ్మతల్లి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు, మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి కల్యాణం నిర్వహించగా, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రతిష్ఠ, చండీహోమం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ, తీర్థప్రసాదం అందించారు.

చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్

మండల విద్యాధికారి శ్రీనివాస్

రామాయంపేట(మెదక్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని మండల విద్యాధికారి శ్రీనివాస్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు తమ దైనందిన జీవితాల్లో కొన్ని నియమాలు పాటించాలని సూచించారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు, నోట్‌బుక్స్ అందజేశారు. పీఈటీలు మల్లేశం, కవిత, యోగా శిక్షకులు భరత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని చెరువు తండాలో శుక్రవారం రాత్రి రోడ్డు భద్రత, డ్రగ్స్ నిర్మూలనపై కళా బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ యువత వాహనం నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. అలాగే డ్రగ్స్‌కు అలవాటు పడి ప్రాణాల మీదికి తెచ్చుకోరాదన్నారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలుగా ఉండాలని, అగంతకులు ఫోన్ చేసినప్పుడు ఓటీపీలు చెప్పడం కాని భయాందోళనకు గురికారాదన్నారు. గ్రామాల్లో మూఢ నమ్మకాలపై తగిన అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాబృందంతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే ధాన్యం తూకం వేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యం సకాలంలో తూకం చేయకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. అకాల వర్షాలకు వడ్లు మొలకెత్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజులుగా కుప్పలు చేసి కవర్లు కప్పడంతో కురుస్తున్న వర్షాల వల్ల ధాన్యం మొలకెత్తాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం తూకం వేసి తరలించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పీఏసీఎస్ సీఈఓ మధు దృష్టికి తీసుకెళ్లగా హమాలీల కొరత మూలంగా ధాన్యం తరలించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

లయన్స్‌క్లబ్ కొత్త కార్యవర్గం

నర్సాపూర్: లయన్స్‌క్లబ్ ఆఫ్ నర్సాపూర్ స్నేహబంధు కొత్త కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా రాఘవేందర్‌రావు, కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా వెంకటస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు బుచ్చేష, జైపాల్, శ్రీకాంత్ తదితరులు నూతన కార్యవర్గ ప్రతినిధులను శాలువాలతో సన్మానించి అభినందించారు.


నూతన కార్యవర్గ ప్రతినిధులను అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తున్నానని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని మయూరినగర్ కాలనీలో పార్కు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ. 50 లక్షలతో నిధులతో పార్కును అభివృద్ధి చేస్తామన్నారు. పచ్చదనం, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు మహిపాల్‌రెడ్డి, వీరిశెట్టి, దేవేందర్ యాదవ్, అంజయ్య, వెంకట్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పీహెచ్‌సీలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, ఉప కమిషనర్ సురేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కల్పన పాల్గొన్నారు.

పకడ్బందీగా ఉల్లాస్ సర్వే నిర్వహించాలి

ఎంపీఓ శ్రీనివాస్, ఎంఈఓ తారాసింగ్

నర్సాపూర్ రూరల్: ఉల్లాస్ ప్రాథమిక సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీఓ వైద్య శ్రీనివాస్, ఎంఈఓ తారాసింగ్ ఐకేపీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం నర్సాపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో ఉల్లాస్ ప్రాథమిక సర్వేపై అవగాహన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకేపీ సీసీలు ఇతర సిబ్బంది ముందుగా మహిళా సంఘాల్లోని నిరక్షర్యాసులను గుర్తించి, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్ వరకు చదివి వదిలేసే వారిని గుర్తించి ఓపెన్ ఇంటర్, డిగ్రీలో చేర్పించి చదివించాలని కోరారు. ముందుగా ఐకేపీ సీసీలు ఇతర సిబ్బంది గ్రామాల్లో ముమ్మరంగా సర్వే చేపట్టి చదువుకోలేని వారికి నిరంతరం వాలంటీర్లతో విద్య నేర్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్, కోఆర్డినేటర్ సుధాకర్ గౌడ్, సీసీలు దేవీసింగ్, రవీందర్, ఆంజనేయులు, భాగ్య, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్‌తో నిరక్షరాస్యతకు చెక్

మనోహరాబాద్(తూప్రాన్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్‌తో నిరక్షరాస్యతను తగ్గుతుందని ఎంఈఓ మల్లేశం అన్నారు. శుక్రవారం మనోహరాబాద్ మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఎంఈఓ మల్లేశం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సమైఖ్య సభ్యులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాలలో 15సంవత్సరాలు దాటి అక్షరాస్యతలేని వారిని గుర్తించి వారికి చదువు నేర్పించాలన్నారు. అంతే కాకుండా వీరికి ఉపాధి అవకాశాలు కలిగేలా, జీవన నైపుణ్యాలు, నిరంతర విద్య, వృత్తి విద్య పలు అంశాలపై శిక్షణను సైతం ఇవ్వనున్నట్లు ఐకేపీ ఏపీఎం పెంటాగౌడ్ తెలిపారు. వీరి కోసం ఉల్లాస్ మొబైల్ యాప్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరక్షరాస్యులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీసీలు శోభారాణి, విజయలక్ష్మీ, సీఆర్పీ ఆపరేటర్లు, వీఓఏ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేటలో..


చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న ఎంఈఓ పుష్పవేణి

చిన్నశంకరంపేట(మెదక్): నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా మార్చడమే ఉల్లాస్ లక్ష్యమని ఎంఈఓ పుష్పవేణి అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండల ఐకేపీ కార్యాలయంలో ఎంపీడీఓ దామోదర్, ఐకేపీ ఏపీఎం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉల్లాస్–నవ భారత్ సాక్షరాస్యత కార్యక్రమంపై మహిళ సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ. ఈ నెల 25 వరకు మహిళల అక్షర స్థితిగతులను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలని కోరారు. సర్వే ద్వారా గుర్తించిన డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి ఓపెన్ టెన్త్‌లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ, వీఓఏలు, మహిళ సమైక్యా సభ్యులు పాల్గొన్నారు.